విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం కామన్ డైట్ మెనూ

తిరుమలాయపాలెం: మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొణిజర్ల: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు, ఎర్రుపాలెం: కామన్ డైట్ మెనూను ప్రారంభిస్తున్న అధికారులు

తిరుమలాయపాలెం, డిసెంబర్ 14: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ తోడ్పాడునందించేందుకే కామన్ డైట్‌ను ప్రభుత్వం తెచ్చిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మాదిరిపురంలో గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కామన్ డైట్ మెనూను మంత్రి పొంగులేటి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో పేద పిల్లలకు మంచి పోషకహారం అందించే లక్ష్యంతో ఇందిరమ్మ ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు భారీగా పెంచినట్లు చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో రూ.150 కోట్ల వ్యయంతో అన్ని వసతులతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, సీఈ శంకర్, డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి, తహసీల్దారు రామకృష్ణ, ఎంపీడీవో శీలర్, ఎంపీవో సూర్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్లలో..

కొణిజర్ల, డిసెంబర్ 14: స్థానిక గిరిజన, సంక్షేమ హాస్టల్స్‌లో కొత్తమెనూ చార్ట్స్‌ను డీఆర్‌డీఏ పీడీ, అడిషనల్ ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్ సన్యాసయ్య శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు తోడ్పాటునందించేలా కామన్ డైట్‌ను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తఫజుల్‌హుస్సేన్, ఎంఈవో అబ్రహం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారేపల్లి: ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న అధికారులు, మధిర: మాట్లాడుతున్న తహసీల్దార్ రాంబాబు

ఎర్రుపాలెంలో..

ఎర్రుపాలెం, డిసెంబర్ 14: స్థానిక గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనూను శనివారం జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ అబ్దుల్ అలీమ్, ఎర్రుపాలెం సివిల్ ఇంజినీర్ వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో, గురుకులాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నూతన మెనూ, కాస్మోటిక్ చార్జీలను ప్రవేశపెట్టిందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు మంచిగా చదువుకొని భవిష్యత్‌లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో గురుకులాల ప్రిన్సిపాల్ చావా జ్యోతి, వైస్‌ప్రిన్సిపాల్ కే.ఇనోక్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ డీ.మధు, పేరెంట్స్ కమిటీ సభ్యులు చిట్టిబాబు, బాబురావు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, అధ్యాకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కూసుమంచిలో..

కూసుమంచి, డిసెంబర్ 14: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన కామన్ డైట్ చార్జీలను ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ కరుణశ్రీ శనివారం నాయకన్‌గూడెంలోని గురుకుల పాఠశాలలో ప్రారంభించి మాట్లాడారు. పేద విద్యార్థులకు మంచి భోజనం అందివ్వాలనే ఆలోచనతో ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచిందన్నారు. విద్యార్థులు చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. డైట్ చార్జీల వివరాలను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రంజిత్ రెడ్డి వివరించారు. అనంతరం అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

కారేపల్లిలో..

కారేపల్లి, డిసెంబర్ 14: మండలంలోని అన్ని వసతిగృహాల్లో విద్యార్థులకు శనివారం ప్రభుత్వం నూతనంగా పెంచిన మెనూను అధికారులు ప్రారంభించారు. తొలుత విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమాలలో మండల ప్రత్యేకాధికారి గంగాధర్, ఎంపీడీవో సురేందర్, ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, ఏసీఎం రాములు, ఏఈలు కిశోర్, ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

వైరా రూరల్..

వైరారూరల్, డిసెంబర్ 14: మండలంలోని ముసలిమడుగు టీటీడబ్ల్యూయూఆర్‌జేసీ గర్ల్స్ రెసిడెన్షియల్ పాఠశాలలో డైట్ మెనూను ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ శనివారం ప్రారంభించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సత్తుపల్లి టౌన్..

సత్తుపల్లిటౌన్, డిసెంబర్ 14: ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన కామన్ డైట్ చార్జీలను బీసీహాస్టల్‌లో ఐడీసీ డీఈఈ నాగేశ్వరరావు, మైనార్టీ పాఠశాలలో డీపీవో ఆశాలత, జిల్లా యువజన క్రీడల అధికారి సునీల్ రెడ్డి, గిరిజన హాస్టల్‌లో కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ శనివారం ప్రారంభించారు. సంక్షేమ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మధిరలో..

మధిర, డిసెంబర్ 14: వసతిగృహాల్లో విద్యార్థులకు ప్రభుత్వం పెంచిన డైట్ మెనూను శనివారం తహసీల్దార్ రాంబాబు ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాములు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రమణ, ఉమారావు, అధ్యాపకులు సత్యం, అయినాల సైదులు, బుచ్చయ్య, అంజయ్య, నాగేశ్వరరావు, రేణుక పాల్గొన్నారు.

లాలాపురంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే

సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, అధికారులు

వైరాటౌన్, డిసెంబర్ 14: వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ళ సర్వేను వైరా మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్ శనివారం పరిశీలించారు. పొరపాట్లు లేకుండా యాప్‌లో వివరాలు నమోదు చేయాలని, అర్హులైన లబ్ధిదారులు నష్టపోకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాల్ కమిషనర్ వేణు, వార్డు కౌన్సిలర్ ఇమ్మడి రామారావు, ఆర్ఐ ప్రదీప్, మున్సిపాల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల చేతులకు సంకెళ్లు వేయడం అమానుషం

మాట్లాడుతున్న యర్ర బాబు

వైరాటౌన్, డిసెంబర్ 14: రైతుల పంట పొలాలను ఫార్మా కంపెనీ కోసం తీసుకొని నష్టపరిహారం కోసం అడిగిన రైతుల చేతులకు బేడీలు వేయడం అమానుషమని సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి యర్ర బాబు అన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. రైతుల పట్ల ప్రభుత్వం ప్రవర్తించిన తీరు బాధాకరమని, అన్నం పెట్టే అన్నదాత చేతులకే సంకెళ్ళు వేయడం సిగ్గుచేటు అన్నారు. అదేవిధంగా గుండెపోటుతో ఉన్న రైతు ఆరోగ్య పరిస్థితి చూడకుండా చేతులకు సంకెళ్లు వేసి తీపుకెళ్లడం పట్ల మానవ హక్కుల సంఘం సుమోటోగా స్వీకరించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కొండా రామకృష్ణ, మిట్టపల్లి రాఘవరావు, షరీఫ్, గారపాటి అశోక్, నర్సింహారావు, దాసు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న సీవై పుల్లయ్య

వైరాటౌన్, డిసెంబర్ 14: ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణాలను వెంటనే రుణ మాఫీ చేసి రైతుకు భరోసా కల్పించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు సీవై పుల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విక్రమ్‌భవన్‌లో డివిజన్ సభ్యుడు తడికమళ్ల సీతారాములు అధ్యక్షతన జరిగిన వైరా డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. లగచర్లలో రైతులపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపి వారిని వైద్యం కోసం బేడీలు వేశారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు కె.అర్జున్‌రావు, ఎలదండి బాబు, పాశం అప్పారావు, షేక్ జానీ, బండారు భద్రయ్య, కన్నెగంటి వెంకటి పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన కందాళ



ధర్మారెడ్డిని పరామర్శిస్తున్న కందాళ

ఖమ్మం రూరల్, డిసెంబర్ 14: మండలంలోని ఆయా గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్ శనివారం పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. తొలుత ఆరెంపుల గ్రామంలో ఇటీవల మరణించిన అరికట్ల వీరబాబు ఇంటికెళ్లి ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను తన ప్రగాడ సానుభూతి తెలిపారు. మద్దివారిగూడెంలో ఇటీవల అనారోగ్యంతో మాజీ సొసైటీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు ధర్మారెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో ఏదులాపురం సొసైటీ చైర్మన్ జర్పుల లక్ష్మణ్‌నాయక్, ముత్యం కృష్ణారావు, గూడా సంజీవరెడ్డి, మట్టా వెంకటేశ్వరరావు, అక్కినపల్లి వెంకన్న, దర్గయ్య, బానోత్ కృష్ణ, యండపల్లి రవి, బాలునాయక్, గిరి, బండి సతీశ్, జానకిరాములు పాల్గొన్నారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మాట్లాడుతున్న ఆర్‌జేసీ కృష్ణ

వైరాటౌన్, డిసెంబర్ 14: మున్నూరు కాపుల అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఖమ్మం వ్యవసాయమార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆర్‌జేసీ కృష్ణ, కాంగ్రెస్ నాయకుడు కొత్తా సీతారాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కామిశెట్టి కల్యాణ మండపంలో రేచర్ల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. మున్నూరు కాపులు వైరా నియోజకవర్గంలో రాజకీయ సామాజిక ఆర్థికంగా ఎదగాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ మంది పోటీ చేయాలన్నారు. ప్రభుత్వం త్వరలో నియమించే కార్పొరేషన్ చైర్మన్‌లలో మున్నూరు కాపు సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి చైర్మన్‌ను నియమించాలన్నారు. సమావేశంలో వైరా మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, నాయకులు కట్ల రంగారావు, కట్ల సంతోష్, పసుపులేటి నాసరయ్య,, మడూరి సైదారావు, పగడాల నరేందర్, కామిశెట్టి రవి, అక్కిశెట్టి రవితేజ, ముదిగొండ పుల్లయ్య, రేచర్ల సత్యం, రవికృష్ణ, పోశం శ్యామ్, గుత్తానాగరాజు, ఆకుల మురళి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలే ఎజెండాగా ఉద్యమాలు



మాట్లాడుతున్న డివిజన్ కార్యదర్శి బండి రమేశ్

కూసుమంచి, డిసెంబర్ 14: రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు తమ వంతుగా సహకారాన్ని అందిస్తూనే ప్రజా సమస్యలే ఎజెండాగా దళిత వాడల నుంచి సీపీఎంను బలోపేతం చేస్తామని సీపీఎం డివిజన్ కార్యదర్శి బండి రమేశ్ అన్నారు. శనివారం కూసుమంచిలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అనేక ఎన్నికల ఫలితాల్లో పార్టీ బలహీనపడిందనే విషయంలో కొంత వరకు నిజమే అయినా కింది స్థాయిలో నుంచి పార్టీని పటిష్ట పరచాలనే ఉద్దేశంతో రాష్ట్ర కార్యదర్శి తమ్మినే వీరభద్రం, రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల పార్టీల ఆదేశాల మేరకు పని చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. కలిసి వచ్చే కమ్యూనిస్టు పార్టీలతో కలిసి ప్రయాణం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ కార్యదర్శులు తాళ్లూరి రాజు, కొమ్ము శ్రీను, సుదర్శన్, గుడవర్తి నాగేశ్వరరావు, నాయకులు బషీర్, రమణా రెడ్డి, షన్ముతరావు, గన్యా నాయక్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య' క్రీడోత్సవాలు ప్రారంభం

క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, తదితరులు

ఖమ్మం సిటీ, డిసెంబర్ 14 : ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రాంతీయ పాఠశాలల వార్షిక క్రీడోత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ముఖ్యఅతిథులుగా హాజరైన ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ, ఖమ్మం అర్బన్ మండల విద్యాధికారి శైలజాలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలకు క్రీడలు పరిష్కారం చూపిస్తాయన్నారు. నేటి యాంత్రిక జీవన ప్రయాణంలో ఆటలు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు చదువుతో పాటు సర్వతోముఖాభివృద్ధి సాధిస్తారని సగర్వంగా చెప్పేందుకే వార్షికపోటీలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి ఏటా జిల్లా, రాష్ట్రస్థాయిల్లో జరిగే కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, త్రోబాల్, క్యారమ్స్, చెస్ వంటి ఆటల్లో సత్తా చాటుతున్నామని స్పష్టం చేశారు. క్రీడలు విద్యార్థుల మధ్య ఐక్యతతో పాటు శారీరక ఎదుగుదలకు తోడ్పడతాయని పేర్కొన్నారు. అనంతరం క్రీడా పోటీలకు శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రాంతీయ పాఠశాలల నుంచి 2100మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఏజీఎంలు శ్రీ చేతన్ మాధుర్, జయప్రకాష్, పాఠశాలల ప్రిన్సిపాల్స్ టీఎల్ఎన్ శర్మ, నాగ ప్రవీణ, ఏడుకొండలు, ఇస్మాయిల్, నీరజ, మురళీమోహన్, రవికుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'రోబోటిక్స్‌తో స్మార్ట్‌సెన్సింగ్ అండ్ కనెక్టివిటీ'పై వర్క్‌షాపు

వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు

సత్తుపల్లిటౌన్, డిసెంబర్14: మండలంలోని సాయి స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) నాలుగు, మూడవ సంవత్సరం విద్యార్థులకు మూడు రోజులుగా కిట్స్ కార్ట్ ఇన్నోవేషన్స్ వారి సహకారంతో 'రోబోటిక్స్‌తో స్మార్ట్‌సెన్సింగ్ అండ్ కనెక్టివిటీ టెక్నాలజీ'పై శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. విద్యార్థులు ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ రోబోటిక్స్ టెక్నాలజీ స్మార్ట్ సెన్సింగ్ అండ్ కనెక్టివిటీ అనేది రూపొందించడంతో కృషి చేస్తుందని వక్తలు తెలిపారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పాముల శేఖర్‌బాబు మాట్లాడుతూ ఇప్పటికే ఉన్నత విద్యతో నాణ్యత ప్రమాణాలు పెంపుదల చేపట్టడం జరిగిందని, విద్యార్థులు, ఉద్యోగాలు పొందేందుకు ఈ వర్క్‌షాపు కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఊటుకూరి శేషారత్నకుమారి, కళాశాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ పీ.నాగశేఖర్, బీ.గోపాలకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో వనసమారాధన

కారేపల్లి, డిసెంబర్ 14: మండలంలోని ఊట్కూర్ బస్‌స్టేజీ సమీపంలో గల మామిడితోటలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం వనసమారాధను నిర్వహించారు. వనసమారాధనలో ఉపాధ్యాయులు కుటుంబ సమేతంగా వచ్చారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు బాలిన వెంకటరెడ్డి, మంగీలాల్, వెంకటేశ్వర్లు, రంగారావు, విజయనిర్మల, శంకర్, లక్ష్మణ్, పద్మావతి, విజయ్‌కుమార్, రత్నకుమార్, వెంకటేశ్వర్లు, బాబు, సుబ్బారావు, రత్నకుమార్, అమృత పాల్గొన్నారు.

వసతిగృహాల సందర్శన

వేంసూరు, డిసెంబర్ 14: మండలంలోని ఎస్సీ, బీసీ వసతిగృహాలను శనివారం వ్యవసాయ అధికారి పీ.రామ్మోహన్, ఎంఈవో చలంచల వెంకటేశ్వరరావు, ఎంపీవో రంజిత్‌కుమార్, పీఆర్ జేఈ సాయిలు సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆయా వసతిగృహాల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి వసతి గృహాల్లో వసతులు, సమస్యలపై అడిగి తెలుసుకున్నారు.

దుప్పట్లు పంపిణీ

వైరాటౌన్, డిసెంబర్ 14: వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వైరా లయన్స్‌క్లబ్ సభ్యులు రాయపూడి వెంకటేశ్ పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో వైరా సాయిబాబా మందిరం వృద్ధులకు దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో వుండ్రు శ్యామ్‌బాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, అబ్బూరి రమేశ్ పాల్గొన్నారు.

మారుమూల పల్లెలకూ విద్యుత్ సరఫరా

ఖమ్మం, డిసెంబర్ 14 : నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఖమ్మం సర్కిల్ పరిధిలో ఎస్టీఎస్డీఎఫ్ నిధుల కింద ఇప్పటివరకు 15 ఎస్టీ ఆవాసాలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందించామని సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ సురేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిపాదించిన 15 ఎస్టీ ఆవాసాలకు వందశాతం విద్యుదీకరణ పూర్తి అయ్యిందని చెప్పారు. అన్ని మారుమూల గిరిజన పల్లెలకు విద్యుత్ అందించడం ప్రథమ లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకు కావలసిన అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రతి పల్లె విద్యుత్ వెలుగులతో విరాజిల్లాలని పేర్కొన్నారు.

నేడు ఖమ్మం 'ఈస్తటిక్స్' సభ

రఘునాథపాలెం, డిసెంబర్ 14 : ఖమ్మం ఈస్తటిక్స్ సాహిత్య పురస్కారాల సభ ఈ నెల 15వ తేదీ ఆదివారం సాయంత్రం ఖమ్మం నగరంలోని డీపీఆర్‌సీ భవనంలో నిర్వహించనున్నట్లు ఖమ్మం ఈస్తటిక్స్ బాధ్యులు పీ రవిమారుత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన ప్రముఖ సాహితీవేత్తలు ఈ వేడుకలో పాల్గొంటారని, ముఖ్యఅతిథులుగా ఓల్గా, నవీన్, ఖదీర్, ఎల్ఆర్ఎస్ ప్రసాద్ హాజరుకానున్నట్లు తెలిపారు. సాహితీప్రియులు హాజరుకావాలన్నారు.

హార్వెస్ట్ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 14 : ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు డాక్టర్ ఏఎస్‌రావు అవార్డ్స్ కౌన్సిల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ రామసహాయం పార్వతిరెడ్డి తెలిపారు. 34వ సైన్స్ టాలెంట్ సెర్చ్‌లో వరుణ్ శ్రీచైతన్య ద్వితీయస్థానం, రిషిత్ నాల్గోస్థానం, హిమవర్షిని 6వ స్థానం సాధించారన్నారు. 18 మంది రెండో రౌండ్‌కు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను విద్యాసంస్థల కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్ అభినందించారు.

క్రీడా పోటీల్లో సత్తాచాటిన 'సర్వజ్ఞ'

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 14 : ఖమ్మం నగరంలోని సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు అండర్-14, 17లో ఫుట్‌బాల్, షటిల్ పోటీల్లో సత్తా చాటారని డైరెక్టర్ రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్ శనివారం తెలిపారు. ఫుట్‌బాల్‌లో జస్మిత, నేహామాధురి, లాస్య, అశ్వక్, ప్రహర్ష్, శశాంక్, రాహుల్, అఖిల్, మహిధర్, శ్రీనాథ్, తనీష్, శ్యామ్‌లు మొదటిస్థానం, షటిల్‌లో వర్షిత్, లుకేష్, శ్రీనివాస్, శ్రీకర్, శ్రీనాథ్ రెండో స్థానం, కేతన్, చరణ డబుల్స్‌లో మొదటిస్థానం సాధించారని తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్ నీలిమ, ఉపాధ్యాయులు అభినందించారు.

టాలెంట్ టెస్ట్‌లో న్యూవిజన్ ప్రతిభ

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 14 : ఖమ్మం నగరంలోని న్యూవిజన్ పాఠశాల విద్యార్థులు డాక్టర్ ఏఎస్‌రావు అవార్డు కౌన్సిల్ నిర్వహించిన ప్రతిభాన్వేషణ పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారని చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ శనివారం తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొనగా న్యూవిజన్ విద్యార్థులు మొదటివిడతలో పదో తరగతి నుంచి 39 మంది, 9వ తరగతి నుంచి 28 మంది అర్హత సాధించారన్నారు. విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

న్యూఇరాలో హిందీ శిక్షణా తరగతులు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 14 : ఖమ్మం నగరంలోని న్యూఇరా పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులకు బోధనా పద్ధతుల్లో మెళుకువలు నేర్పేందుకు శనివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఉపాధ్యాయ శిక్షకురాలు రామలక్ష్మి దాస్ ఆధ్వర్యంలో హిందీ మాట్లాడటంలో, అర్థం చేసుకోవడంలో ఎదుర్కొనే సమస్యల నుంచి అధిగమించి సరళ పద్ధతిలో నేర్చుకోవడం ఎలాగో వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ ఐవీ రమణారావు, డైరెక్టర్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా బైక్ ర్యాలీ

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 14 : విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా శనివారం టీపీటీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ పే స్కేల్‌ను ముఖ్యమంత్రి హామీ ఇచ్చినందున వెంటనే ప్రకటించాలని, లేకపోతే దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. జనగామ జిల్లా మెసెంజర్ యాకయ్యకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు పద్మ, విజయ్ కుమార్, పీఆర్‌టీయూ నాయకులు వైవీ, సంఘం నాయకులు ఝాన్సీసౌజన్య, మహబూబ్‌పాషా పాల్గొన్నారు.

నాభిశిల, విగ్రహాల ప్రతిష్ఠ

కూసుమంచి, డిసెంబర్ 14: మండలంలోని పెరికసింగారంలో నాభిశిల, ముత్యాలమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠను శనివారం జరిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కందాళతోపాటు సతీమణి విజయమ్మ, కూతురు దీపిక, నాయకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

వాకర్స్ ప్యారడైజ్‌ను సందర్శించిన మేయర్



వాకర్స్‌తో మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మం, డిసెంబర్ 14 : ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో గల వాకర్స్ ప్యారడైజ్‌ను నగర మేయర్ పునుకొల్లు నీరజ శనివారం సందర్శించారు. మార్నింగ్ వాకర్స్‌తో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాకింగ్ ట్రాక్‌పై ఒక లేయర్ మట్టి వేయాలని వాకర్స్ మేయర్‌ను కోరారు. అలాగే చుట్టూ పెన్సింగ్ కూడా పకడ్బందీగా ఏర్పాటు చేయాలని కోరారు. వాకర్ ప్యారడైజ్, లకారం ట్యాంక్‌బండ్ మధ్యలో ఉన్న వాగుని శుభ్రపరిచేందుకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని అధికారులను మేయర్ ఆదేశించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రాధిక, ఏఈ శ్రీనివాస్, సరిపుడి సతీష్ పాల్గొన్నారు.

గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

సత్తుపల్లిటౌన్ డిసెంబర్14: గంజాయి విక్రయిస్తున్నారనే పక్కా సమాచారంతో శుక్రవారం మధ్యాహ్నం వేంసూరు రోడ్డులోని ఓ మామిడితోటలో ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీపీ రఘు, సీఐ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వేంసూరు రోడ్డులో గల ఓ మామిడితోట వద్ద ఆరుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలతో ఉండగా సత్తుపల్లి సీఐ, ఎస్సైలు పెట్రోలింగ్ చేస్తుండగా వారిని చూసి వారు పారిపోతుండగా నలుగురిని అదుపులోకి తీసుకోగా ఇద్దరు పరారయ్యారని తెలిపారు. జుంజునూరి సింహాద్రి, శ్రీనాథ్‌లు పరారు కాగా పారుపల్లి తరుణ్‌కుమార్, జగం అకిల్, కలపాల రాంబాబు, షేక్ ఇబ్రహీంలను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 111.29 గ్రాముల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య

రఘునాథపాలెం, డిసెంబర్ 14 : అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం కోటపాడు గ్రామంలో చోటుచేసుకుంది. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. కోటపాడు గ్రామానికి చెందిన యువరైతు గునిపిన్ని భూపతిరావు(30) తనకున్న పొలానికి తోడుగా పక్క గ్రామమైన కోయచలకలో మరి కొంత భూమిని కౌలు తీసుకొని మిర్చిపంట సాగు చేస్తున్నాడు. మిర్చితోట వైరస్‌తో ఎండిపోవడంతో పంట కోసం తెచ్చిన అప్పులు, ఇతర అప్పులు తీర్చే మార్గం కనపడకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. శనివారం పొలానికి వెళ్లిన భూపతిరావు ఫోన్ ద్వారా అప్పుల విషయమై భార్యకు చేరవేసి పురుగుల మందు తాగాడు. అప్రమత్తమైన భార్య హుటాహుటిన గ్రామస్తుల సహాయంతో భూపతిరావును ఖమ్మం తరలించే క్రమంలోనే మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

భార్యపై భర్త దాడి

వేంసూరు, డిసెంబర్ 14: భార్యపై భర్త, మరో ముగ్గురు కలిసి దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలులోకి వచ్చింది. మండలంలోని దిద్దుపూడి గ్రామానికి చెందిన నక్క వెంకటేశ్వరమ్మకు 25 సంవత్సరాల క్రితం ఏలూరు జిల్లా చెక్కపల్లి గ్రామానికి చెందిన నక్క అచ్చయ్యతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం పెళ్లిళ్లు కూడా జరిగాయి. తాగుడికి బానిసై అచ్చయ్య వేధింపులకు గురి చేస్తుండడంతో భరించలేక భార్య వెంకటేశ్వరమ్మ నెల క్రితం దిద్దుపూడి తన పుట్టింటికి వచ్చి తల్లిదండ్రులతో ఉంటుంది. చెక్కపల్లిలో భార్య పేరుపై కొంత భూమి ఉండడంతో అచ్చయ్య ఆ భూమి తన పేరుమీద రాసివ్వాలని ఒత్తిడి చేస్తూ ఈ నెల 11న మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి అచ్చయ్య దిద్దుపూడి వచ్చి రోకలి బండతో కొట్టడంతో ఆమెకు తలకు, చేతికి గాయాలయ్యాయి. శనివారం ఆమె వేంసూరు పోలీస్‌స్టేషన్‌లో తన భర్త నక్క అచ్చయ్యతో పాటు, వెంట వచ్చిన గుర్రం రంగారావు, పెద్దవీరస్వామి, బాబురావు కలిసి తనపై దాడి చేశారని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఖమ్మం రూరల్, డిసెంబర్ 14: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ పట్టణం రాజీవ్‌నగర్‌కు చెందిన సలగట్టు హరిబాబు (41) ఈ నెల11వ తేదీన స్నేహితులతో కలిసి మహబూబాబాద్ నుంచి హుజూర్‌నగర్‌కు ఆటోలో బయలుదేరాడు. మండలంలోని వెంకటగిరి క్రాస్‌రోడ్డులో రాత్రి 2గంటల సమయంలో ఆటో అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యారు. దీంతో హరిబాబును ఆటోలోని ఇతర వ్యక్తులు స్థానికులు ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందజేశారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. తన భర్త మృతికి ఆటోలో తనతో ప్రయాణం చేసిన సతీశ్, మరియాదాసు, ఆటో డ్రైవర్ ఆవుల సతీశ్‌లు కారణమని మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

★త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338978-AII

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616